క్లుప్తంగా

పంట పొలాల్లో దొంగల హల్‌చల్



మోపిదేవి: పంట పొలాల్లో దొంగలు పడి విద్యుత్ మోటార్లకు బిగించిన కాపర్ వైర్లు చోరీకి తెగబడుతున్నారు. మండలంలో వారం రోజులుగా మోపిదేవివార్పు, బొబ్బర్లంక, తదితర గ్రామాల్లో సుమారు 50 మందికి పైగా రైతుల పొలాల్లో కాపర్ వైర్లు దొంగిలించుకుపోయారని రైతులు వాపోయారు. విద్యుత్ వైర్లు తగలపెట్టి అందులోని కాపర్ (రాగి) వైర్లు పట్టుకుపోతున్నారు. ఒక్కో గ్రామంలో ఒక్కోవిధంగా చోరీకి పాల్పడుతూ రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నారని విచారం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు గట్టి నిఘా పెట్టి దొంగలను పట్టుకుని కఠినంగా శిక్షించాలని రైతులు కోరుతున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

గూడూరు: మండల పరిధిలో బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ సోమవారం పంపిణీ చేశారు. గూడూరులో జరిగిన కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన 15 మంది బాధితులకు రూ.8.54 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. మరో కార్యక్రమంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజినీర్స్ డే వేడుకలను గూడూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరయ్య చిత్రపటానికి ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పూల మాలలు వేసి నివాళులర్పించారు.

దసరా ఉత్సవ కరపత్రాల ఆవిష్కరణ



మచిలీపట్నంటౌన్: నగరంలోని గాంధీబొమ్మ శివాలయం ఆవరణలో వేంచేసి ఉన్న శ్రీ మహిషాసుర మర్ధిని సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాల కరపత్రాలను కమిటీ ప్రతినిధులు సోమవారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ గురువారం వరకు దసరా ఉత్సవాలు జరుగుతాయన్నారు. 22వ తేదీ ఉదయం 10.06 గంటలకు కలశస్థాపనతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. రోజువారీ నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తమ్మన రాధాకృష్ణమూర్తి, కార్యదర్శి ఎండూరి సురేష్ బాబు, కమిటీ సభ్యులు వాసు, ఆలయ అర్చకులు కందుకూరి చిట్టిబాబు, గట్టుపల్లి సాయిచరణ్, చేబ్రోలు బాబీ పాల్గొన్నారు.

పాఠశాలలో వాటర్ ట్యాంకు ప్రారంభం



పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండలంలోని పెదకళ్లేపల్లిలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం విశ్రాంతి ఉపాధ్యాయులు రావి దుర్గా సుధాకరరెడ్డి ఆర్థిక సౌజన్యంతో రూ.60 వేలతో మంచినీటి ట్యాంకు, పైప్‌లైన్ మరమ్మతులు, పాఠశాలలో డ్రెయినేజీ ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ రావి దుర్గావాణి తెలిపారు. పాఠశాలలో వాటర్ ట్యాంకు ద్వారా మంచినీటి సరఫరాను సోమవారం ఎంపీపీ ప్రారంభించారు. పాఠశాల హెచ్‌ఎం మోహనరావు, జెడ్పీటీసీ మెడబలిమి మల్లిఖార్జునరావు, గ్రామ సర్పంచ్ అరజా సంధ్యారాణి, ఎంపీటీసీ సభ్యురాలు అరజా ఆశాదేవి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ నాగలక్ష్మి, ఎంఈవోలు జీఎస్‌వీ గోపాల్, ఏజీ రమణ, విశ్రాంతి హెచ్‌ఎం కంఠంనేని కుటుంబరావు, ఏఎస్ నాగేశ్వరావు, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరావు, అరజా కిరణ్‌కాంత్, విశ్రాంతి వీఆర్వో అరజా వెంకటేశ్వరావు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

కోనేరుసెంటర్: బాలిక అదృశ్యంపై చిలకలపూడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మచిలీపట్నం సర్కారుతోటకు చెందిన మైనర్ ఓ స్కూలులో ఎనిమిదో తరగతి చదువుతోంది. సోమవారం తెల్లవారు జామున బాలిక ఇంటి నుంచి బయటికి వెళ్లి ఎంతకీ తిరిగిరాలేదు. అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు బంధువులు, బాలిక స్నేహితుల వద్ద ఆరా తీశారు. ప్రయోజనం లేకపోవటంతో తండ్రి తన కుమార్తె కనిపించటం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గౌతమ్ అనే యువకుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశాడు. ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లేళ్లగరువులో ఫీవర్ సర్వే

గూడూరు: మండల పరిధిలోని లేళ్లగరువు గ్రామంలో ఆరోగ్య సిబ్బంది సోమవారం ఫీవర్ సర్వే నిర్వహించారు. హెల్త్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, సీహెచ్‌ఓ మౌనిక, ఏఎన్‌ఎం భవానీ ఇంటింటికీ తిరిగి ఆరోగ్యంపై ఆరా తీశారు. విష జ్వరాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

రంగుమారిన నీరు.. ప్రజలు బేజారు

- వాడకానికి ఆ చెరువు నీరే దిక్కు
- నీటి రంగు పచ్చగా మారడంతో గ్రామస్తుల ఆందోళన
- గ్రామంలో తాగునీరూ కరువే
- ఇతర అవసరాలకు ఊర చెరువే ఆధారం
- విషజ్వరాలు.. దద్దుర్లు.. దురదలతో బేంబేలు



పచ్చ రంగులోకి మారిన లంకలకలువగుంట ఊర చెరువులోని నీరు

పెడన: రంగు మారిన నీటిని తప్పని పరిస్థితులలో వాడాల్సి వస్తోందని, ఆ నీటిని శుద్ధి చేసేలా అధికారులు చొరవ తీసుకోవాలని లంకలకలువగుంట గ్రామస్తులు మొర పెట్టుకుంటున్నారు. రంగుమారిన నీటితో ఏ సమస్య వస్తుందోనని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

విషయం ఇదీ..

మండల పరిధిలోని లంకలకలువగుంట గ్రామ పంచాయతీలో ఊర చెరువు ఉంది. ఈ గ్రామానికి రక్షిత పథకం కుళాయిల ద్వారా ఫిల్టర్ చేయకుండా నేరుగా అరకొర నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పక్కనే ఉన్న ఊర చెరువు నీటిపై సుమారు 130కి పైగా కుటుంబాలు ఆధారపడి వాడకానికి వినియోగిస్తున్నారు. పశువులు తాగేందుకు, పశువులను పరిశుభ్రం చేయడానికి, కుటుంబ సభ్యులు స్నానాలకు, బట్టలు ఉతకడానికి ఈ నీటిని తీసుకువెళ్లి వినియోగించుకుంటారు.

ఇటీవల రంగుమారడంతో..

అటువంటి నీరు ఇటీవల పచ్చరంగులోకి మారిపోయాయి. వాడకానికి తప్పనిసరి అయిన ఈ నీటిని తీసుకువెళ్లి వినియోగిస్తుంటే దద్దుర్లు, దురదలు రావడంతో పాటు జ్వరాలు కూడా వస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. దుస్తులు ఉతికి ఆరేసిన తరువాత వాటిని వేసుకుంటే దురదలు వస్తున్నాయని వాపోతున్నారు. తక్షణం అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాగునీటికీ తిప్పలే..

గ్రామస్తులు తాగునీటికి కూడా తిప్పలు పడుతున్నారు. గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ఉంది. అయితే ఫిల్టర్ బెడ్లు సరిగా పనిచేయకపోవటం వల్ల నేరుగా కుళాయిల ద్వారా చెరువు నీరు సరఫరా చేస్తున్నారు. దీంతో తాగునీటికోసం ప్రైవేటు శుద్ధి జల ప్లాంట్లపై ఆధార పడుతున్నారు. గ్రామానికి మూడు కి.మీ. దూరంలో ఉన్న ఉరిమి గ్రామం నుంచి తాగునీటి క్యాన్లను కొనుగోలు చేసి తెచ్చుకోవాల్సిన పరిస్థితి కొనసాగుతోంది.

ఇలా చేస్తే సరి..

రంగుమారిన చెరువునీటిపై ఆరా తీసి శుద్ధి చేయాలి. రక్షిత తాగునీటి పథకం ఫిల్టర్ బెడ్లు సక్రమంగా పనిచేసేలా చూడాలి. గ్రామంలో ఆర్‌వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలి. ఇందుకు తగిన చర్యలు తీసుకుని తమను రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గతంలో ఇలా ఎప్పుడూ చూడలేదు



కుళాయిల ద్వారా వచ్చే నీరు అంతంత మాత్రమే. గత కొన్ని సంవత్సరాల నుంచి ఊర చెరువులోని నీటిని వాడకానికి వినియోగిస్తున్నాం. ఎప్పుడూ లేని విధంగా ఈ సారి నీరంతా పచ్చరంగులోకి మారిపోయాయి. ఆ నీటిని వినిగిస్తుంటే జ్వరాలు, దద్దుర్లు, దురదలు వస్తున్నాయి. నీటిని వాడటానికి భయపడుతున్నాం. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విన్నవించుకుంటున్నాం.

– శిరంగి నాగమణి, లంకలకలువగుంట గ్రామం, పెడన మండలం

తప్పకుండా చర్యలు తీసుకుంటా



ఇప్పటి వరకు నా దృష్టికి ఎవరూ తీసుకురాలేదు. మీరు తెలియజేయడంతో ఇప్పుడే సంబంధిత పంచాయతీ కార్యదర్శి శిరీషతో మాట్లాడి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అవసరమైతే సంబంధిత వైద్య సిబ్బందితో మాట్లాడి మెడికల్ క్యాంపు కూడా ఏర్పాటు చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకుంటా.

– ఎ.అరుణకుమారి, ఎంపీడీవో, పెడన

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



కె.కొత్తపాలెం (మోపిదేవి): మండల పరిధిలోని కె. కొత్తపాలెం గ్రామంలో మత్తి ఉమామహేశ్వరావు (72) ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సోమవారం ఉదయం ఆయన ఇంటి వద్ద భౌతికగాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయనతో పాటు గ్రామ పార్టీ కన్వీనర్ మత్తి వెంకట రాజాచంద్, పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ తుటారం కృష్ణ, తుటారం గోపాలకృష్ణ, బాబీ తదితరులు ఉన్నారు. మృతుడికి భార్య లీలా, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

పాపవినాశనం(ఘంటసాల): శ్రీకాకుళం పీఏసీఎస్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ నేత అర్జునరావు మాతృమూర్తి డొక్కు వీరమ్మ అకాల మరణం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త సింహాద్రి రమేష్ బాబు అన్నారు. మండలంలోని పాపవినాశనం గ్రామానికి చెందిన వీరమ్మ ఆదివారం అకాల మరణం పొందారు. మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబు పాపవినాశనం గ్రామంలో వీరమ్మ భౌతికకాయాన్ని సందర్శించినివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. జెడ్పీటీసీ తుమ్మల మురళీ కృష్ణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వేమూరి వెంకట్రావు, యువనేత వేమూరి ప్రవీణ్, వైస్ ఎంపీపీ మాడెం నాగరాజు, పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ వేమూరి రత్నశేఖర్, నేత చిట్టూరి రమేష్, నేతలు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఇంజినీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. క్యాంపస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. విజయకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. ఉష మాట్లాడుతూ ప్రఖ్యాత సివిల్ ఇంజినీర్‌గా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారన్నారు. విశాఖపట్నం సముద్రతీరాన్ని కోత నుంచి రక్షించే వ్యవస్థను రూపొందించడంలో ఆయన విశేష కృషి చేశారన్నారు. వర్సిటీ చీఫ్ ఇంజినీర్ జి.నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య దేశానికి చేసిన విశేష సేవలను విద్యార్థులకు విశదీకరించారు. అనంతరం ఇంజినీరింగ్ కళాశాల డీన్ ఆచార్య వైకే సుందరకృష్ణ మాట్లాడుతూ అతి సామాన్య స్థాయి నుంచి అసామాన్య స్థాయికి ఎదిగి మన దేశ అత్యున్నత పురస్కారం అయిన భారతరత్న పొందడంలో విశ్వేశ్వరయ్య చేసిన కృషి, పట్టుదలే కారణమన్నారు. అలాంటి గొప్ప వ్యక్తిని స్ఫూర్తిగా తీసుకుంటే భావి తరం కూడా అద్భుతాలు సృష్టించవచ్చు అన్నారు. ఇంజినీరింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు, రొట్టెల పంపిణీ

మచిలీపట్నంటౌన్: ఇంజినీర్స్ డేను లైసెన్స్‌డ్ సర్వేయర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని ఈడేపల్లిలోని జట్టి నరశింహం ప్రభుత్వ వృద్ధాశ్రమంలో, సర్కారుతోటలోని శ్రీ వాసవి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, బిస్కెట్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్వేయర్ల సంఘం అధ్యక్షుడు వ్యాసం గోపాల్, కోస్తా మురళీకృష్ణ, ఆర్విఎస్ మురళీధర్, టి.శ్రీనివాస్ శ్రీపతి ప్రసాద్, జీవీ సుబ్బారావు తదితరులను వృద్ధాశ్రమం ప్రతినిధుల సత్కరించారు. వృద్ధాశ్రవమం అధ్యక్షుడు పులవర్తి నటరాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి యూ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సన్నిధి నాగ సాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. తొలుత నగరంలోని సర్కారుతోటలోని స్విమ్మింగ్‌పూల్ వద్ద ఉన్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి సంఘ ప్రతినిధులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

పెడన: భారత రత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం జాతీయ ఇంజినీర్స్ డే ఘనంగా నిర్వహించినారు. ముఖ్యఅతిథిగా ఏపీసీపీడీసీఎల్ పెడన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్‌ఆర్‌కే మాణిక్యలరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సభను ప్రారంభించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కరస్పాండెంట్ కె.కుమారబాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.బాబా, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్‌ఎస్ రెడ్డి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. రాజారమేష్, ఆయా విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పెడన సభలో మాట్లాడుతున్న ఏడీఈ మాణిక్యలరావు

వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కిట్టు విస్తృత పర్యటన



సత్తెనపాలెంలో బడ్డీకొట్టును పునఃప్రారంభిస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కిట్టు సోమవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్న పలు వైఎస్సార్ సీపీ కుటుంబాలను పరామర్శించారు. తొలుత ఇటీవల జనసేనకు చెందిన కొందరు గూండాల దాడిలో ఆస్తి నష్టం జరిగిన మద్దుల సతీష్‌ను పరామర్శించారు. అనంతరం అతని బడ్డీదుకాణాన్ని పునఃప్రారంభించారు. అక్కడి నుంచి బయలుదేరిన కిట్టు రోడ్డు ప్రమాదానికి గురైన సత్తెనపాలెంలోని పోసిన శశి కలిసి పరామర్శించారు. పల్లెతాళ్లపాలెంలో ఇటీవల మరణించిన మోపిదేవి నరసింహస్వామి కుటుంబాన్ని, శ్రీనివాసనగర్‌లోని జనా శ్రీనివాసరావును పరామర్శించారు. నవీన్‌మిట్టల్ కాలనీలో పార్టీ కార్యకర్త కందుల నాగవెంకట రమేష్ మరణించగా అతని కుటుంబాన్ని పరామర్శించారు. అదే కాలనీకి చెందిన జ్యోతి అనే పార్టీ సానుభూతిరాలి కుమారుడు ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్నట్లు తెలుసుకున్న కిట్టు వారిని పరామర్శించారు. నార్త్ మండల అధ్యక్షుడు మట్టా మోహన నాంచారయ్య, మండల ఉపాధ్యక్షుడు బలగం వీరరాఘవయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు భోట్ల రాము, యువజన విభాగం మండల ఉపాధ్యక్షుడు జువ్వా నాగాంజనేయులు, ప్రచార కమిటీ అధ్యక్షుడు పరింకాయల అశోక్, ప్రచార కమిటీ కార్యదర్శి ఈమన శ్రీనివాసరావు, మద్దెల పాండు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు



గోశాలలో గోవులను పరిశీలిస్తున్న దృశ్యం

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానానికి చెందిన గోశాలలో సోమవారం గోవులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. జిల్లా జంతు సంపద సంయుక్త సంచాలకులు (డీఏహెచ్‌ఓ) ఎం.చిన్న నరసింహులు, స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ నందకిషోర్‌తో కలసి గోశాలను పరిశీలించారు. అనంతరం గోవులకు టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ ఆవుల సంరక్షణకు జాగ్రత్తలు, పరిశుభ్రత, ఆహార నియమాలు పాటించాలని సిబ్బందికి వివరించారు. అంతకుముందు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించారు. ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు అందించి, ఆలయ మర్యాదలతో సత్కరించారు.

525 పశువులకు వ్యాక్సిన్లు

బంటుమిల్లి: మండల పరిధిలోని బంటుమిల్లి, పెదతుమ్మిడి, అర్తమూరు పశువుల ఆసుపత్రుల ఆధ్వర్యంలో సోమవారం 525 పశువులకు వ్యాక్సిన్లు వేశారు. పెదతుమ్మిడి వైద్యాధికారిణి స్ఫూర్తి వివరాలు తెలిపారు. పెందుర్రు, మల్లంపూడి 70, నాగేశ్వరరావుపేట 125, బంటుమిల్లి 230, అర్తమూరు 30 పశువులకు ఆయా గ్రామాల్లోని వైద్య సిబ్బంది వైవీవీ ప్రసాదరావు, జి. స్వర్ణసింగ్, వి.రాజీవ్, త్రినాథ్‌నాగసాయిరామ్‌ల పర్యవేక్షణలో వ్యాక్సిన్ కార్యక్రమం నిర్వహించినట్లు స్ఫూర్తి వివరించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు. అక్టోబరు 10వ తేదీ వరకు ప్రతి గ్రామంలోనూ గుర్తించిన 8,600 పశువులకు వ్యాక్సిన్లు వేస్తామన్నారు. గాలికుంటు, అంటు వ్యాధులు, వైరస్‌లు రాకుండా పశువులకు వ్యాక్సిన్ వేయించాలని రైతులను కోరారు.

చినకళ్లేపల్లి(ఘంటసాల): మండలంలోని ఘంటసాల, చినకళ్లేపల్లి గ్రామాలోల జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో 82 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు సోమవారం వేశారు. మండలంలో 12,832 పశువులకు టీకాలు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ దేవిన హరీష్ తెలిపారు. చినకళ్లేపల్లి సర్పంచ్ గుత్తికొండ రామారావు (రాము), పశు పోషకులు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అవనిగడ్డ: మండల పరిధిలోని అశ్వరావుపాలెంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల మాసోత్సవ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సోమవారం ప్రారంభించారు. మాసోత్సవ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. సర్పంచ్ పి.లంకమ్మ ప్రసాద్, పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ నాగభూషణబాబు, అసిస్టెంట్ డైరెక్టర్ బొండు సాంబశివరావు, మండల పశువైద్యాధికారి షఫీ, మౌనిష్, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆటల పోటీలు ప్రారంభం

ఘంటసాల: స్థానిక జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) మండల స్థాయి ఆటల పోటీలను ఎంఈవో– 2 ఎండీ మోమిన్‌తో కలసి ఇన్‌చార్జి ఎంపీడీవో కేజే శ్రీనివాస చంద్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల స్పోర్ట్స్ కన్వీనర్ వీవీ పిచ్చేశ్వరరావు మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్‌ఐ మండల స్థాయి టీమ్‌లు ఏర్పాటు చేసేందుకు అండర్– 14, అండర్– 17 పరిధిలో బాల బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, చెస్ పోటీలను నిర్వహించారు. మండలంలోని ఘంటసాల, కొడాలి, గోగినేనిపాలెం, శ్రీకాకుళం, లంకపల్లి, మల్లంపల్లి, మల్లాయి చిట్టూర్పు హైస్కూల్స్ నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆయా పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో మండల స్థాయిలో జట్లను ఎంపిక చేశామని, త్వరలో నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని పిచ్చేశ్వరరావు వివరించారు. విజేతలైన వారిని ఎంఈవో– 2 మోమిన్, హెచ్‌ఎం శ్రీరంగవల్లి, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్‌ఎం ఎం.శ్రీరంగవల్లి, ఆయా హైస్కూల్స్ వ్యాయామ ఉపాధ్యాయులు రవి, రామారావు, వెంకటేశ్వరరావు, గోవిందరాజులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోడూరు: మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలను సోమవారం ఘనంగా ప్రారంభించారు. స్థానిక స్వతంత్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ పోటీలను డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు ప్రారంభించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అండర్–14, 17 విభాగాల్లో బాల, బాలికలకు వేర్వేరుగాపోటీలను నిర్వహిస్తున్నారు. తొలిరోజు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడల్లో పోటీలను జరిపారు. మంగళవారం కూడా పోటీలు కొనసాగుతాయని హెచ్‌ఎం మెండు ఉమామహేశ్వరరావు చెప్పారు. ఎస్‌ఐ చాణిక్య, ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు, ఎంపీటీసీ తిమ్మన నాంచారయ్య, పీఏసీఎస్ చైర్‌పర్సన్ పూతబోయిన కరుణకుమార్, ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్ గజేంద్రరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస చంద్

ఎగ్‌కార్ట్‌ను అందజేసిన ఎమ్మెల్యే

పెడన: మండల పరిధిలోని దేవరపల్లి గ్రామానికి చెందిన పంతగాని సుహాసినికి ఎగ్‌కార్ట్ యూనిట్‌ను సోమవారం పెడన టీడీపీ కార్యాలయంలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అందజేశారు. ఎన్‌ఈసీసీ భాగస్వామ్యంతో రూ.50 వేలు విలువ గల ఈ యూనిట్‌ను వెలుగు ద్వారా ఎమ్మెల్యే చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సదరు మహిళకు ఆర్థికంగా నిలదొక్కుకుని అభివృద్ధి సాధించాలని సూచించారు. జెడ్పీటీసీ ఆర్జా వెంకటనగేష్, పార్టీ మండల కార్యదర్శి శీరం ప్రసాద్, ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్, ఎంపీడీవో అరుణకుమారి, వెలుగు ఏపీఎం శ్రీదేవి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఏపీటీఎఫ్ నాయకుల వినతి



అవనిగడ్డ: న్యాయమైన తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ నేతలు స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. పలు డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 11 నుంచి 17 వరకూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన వారం కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు వినతి పత్రం సమర్పించారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేలా ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. ఏపీటీఎఫ్ కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి వి.సాంబశివరావు, జిల్లా కార్యదర్శి చీర్ల నాగప్రసాద్, జిల్లా ఆడిట్ కన్వీనర్ వైవీ కృష్ణకాంత్, మోపిదేవి మండల అధ్యక్షుడు ఎంవీ రమణ, చల్లపల్లి మండల ప్రధాన కార్యదర్శి పి.దుర్గాప్రసాద నాయకులు జి.వెంకటేశ్వరరావు, కె.విఠల్, రోహిణికుమార్, ఎం.శ్యాంప్రసాద్, ఎస్‌జీ భారతి, ధర్మజ్ఞాని, లలితకుమారి పాల్గొన్నారు.

వేతనాలకోసం శానిటేషన్ వర్కర్ల ఆందోళన



ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వద్ద ఆందోళనచేస్తున్న శానిటేషన్ వర్కర్లు

మచిలీపట్నంఅర్బన్: స్థానిక సర్వజన ప్రభుత్వ ఆస్పత్రిలో కృష్ణా జిల్లా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శానిటేషన్ వర్కర్లు సోమవారం ఆందోళన చేపట్టారు. నాలుగు నెలలుగా కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించకపోవడంతో పాటు పీఎఫ్, ఈఎస్‌ఐలను సకాలంలో జమ చేయకపోవడం వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు శానిటేషన్ వర్కర్లు మాట్లాడుతూ మెడికల్ కాలేజీలో ఐదు నెలలుగా జీతాలు అందకపోయినా కష్టాల మధ్య విధులు నిర్వహిస్తున్నామన్నారు. పైగా ఇద్దరు సూపర్వైజర్లను ఇన్‌చార్జులుగా పెట్టి మరింత వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ఆస్పత్రిలో చెత్త బళ్లు పనిచేయకపోవడం, అవసరమైన మెటీరియల్ సరఫరా చేయకపోవడం వల్ల శానిటేషన్ పనులు అస్తవ్యస్తంగా మారుతున్నాయన్నారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు లింగం ఫిలిప్, మచిలీపట్నం నియోజకవర్గ కార్యదర్శి ఒంటి పులి లక్ష్మణరావు, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పనింద్ర, జోసెఫ్, జి.లక్ష్మి, పి.దుర్గా, ధనలక్ష్మి, మోహన్, అంబేడ్కర్‌తో పాటు శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్వా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి




తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కృత్తివెన్ను: అమెరికా విధానాలతో ఆక్వా రంగం సంక్షోభంలో పడిందని దీని నుంచి ఆక్వారైతులు గట్టెక్కాలంటే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని రైతు సంఘం నాయకులు కృత్తివెన్ను ఇన్‌చార్జి తహసీల్దార్ శశికుమార్‌కు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఎంపెడా ద్వారా ప్రభుత్వం కౌంటర్ గ్యారెంటీ ఇచ్చి సరైన గిట్టుబాటు ధరకు రైతుల వద్ద నుంచి ఆక్వా ఉత్పత్తులను కొనుగోలు చేయాలని, ఆక్వా రంగానికి బీమా సదుపాయం కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎక్సలెన్సీ నిధులు ఇచ్చి ఆక్వా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి పత్రాన్ని అందించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, సర్పంచ్‌లు పులగం సుబ్రహ్మణ్యం, పాశం కృష్ణ, ప్రత్తిపాటి రామాంజనేయులు, నరసింహారావు, సత్యనారాయణ ఉన్నారు.

రేషన్ డీలర్లకు కొత్త ఈ పోస్ పరికరాలు

పెడన: మండలంలోని పట్టణం, రూరల్ ఏరియాలలో ఉన్న 47 రేషన్ దుకాణాలకు చెందిన డీలర్లకు కొత్త ఈ పోస్ యంత్రాలను అందజేశామని పెడన ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ తెలిపారు. సోమవారం ఈ పోస్ యంత్రంపై పలు సందేహాలను నివృత్తి చేసుకునేందుకు కొత్తగా వచ్చిన వాటిని తహసీల్దారు పరిశీలించారు. ప్రభుత్వం కొత్తగా వైట్ రేషన్‌కార్డుల స్థానంలో స్మార్ట్ రేషన్ కార్డులు జారీ చేసిన విషయం తెల్సిందే. వీటికి అనుసంధానంగా ఈ పోస్ యంత్రాలు కూడా ఉండాలనే ఉద్దేశంతో కొత్త ఈపోస్ యంత్రాలను అందించింది. ఏటీఎంలో కార్డు పెట్టిన విధంగా ఈ పోస్‌లో కార్డు పెట్టడం లేదా వేలి ముద్ర, లేదా ఫొటో కూడా తీసుకునే విధంగా ఈ పోస్‌ను డిజైన్ చేశారని తహసీల్దారు తెలియజేశారు.

వరితో పాటు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి



సదస్సులో మాట్లాడుతున్న కృష్ణాజిల్లా ఉద్యాన శాఖ అధికారి జె.జ్యోతి

చల్లపల్లి: వరికి ప్రత్యామ్నాయ పంటలపై స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో రైతు నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, ఎన్‌ఆర్‌ఐ మండవ శేషగిరిరావు ఆధ్వర్యంలో సోమవారం రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కృష్ణాజిల్లా ఉద్యానశాఖ అధికారి జె.జ్యోతి మాట్లాడుతూ వరితోపాటు ఇతర పంటలు వేసి ఆదాయాలు సాధించే సత్తా రైతులకు ఉందన్నారు. వరిపంట సాగుచేసే రైతులు గట్లను పెద్దవిగా చేసుకుని వాటిపై కొబ్బరి, కంది, ములగ, డ్రాగన్ ఫ్రూట్, కూరగాయలు వంటివి సాగు చేయటం వల్ల అధికా లాభాలు సాధించే అవకాశం ఉందని పేర్కొన్నారు. వక్క మొక్కలు నాటి దానిలో అంతర పంటగా కోకో, మిరియాలు పండించటం ద్వారా ఒకే సమయంలో పలు రకాల దిగుబడులతో లాభాలు సాధించవచ్చని అన్నారు. ఒక పక్క వరి సాగు చేసుకుంటూనే పామాయిల్ సాగు కూడా వేసుకోవచ్చన్నారు. రిటైర్డ్ ఆర్డీవో నాదెళ్ళ శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేకమైన పాలసీ విధానాన్ని తీసుకువచ్చినప్పుడే ఏపంటలు పండించటానికి, మార్కెట్ చేయటానికి అవకాశాలు మెండుగా ఉంటాయని, ప్రభుత్వం ఆరకంగా ఆలోచించాలని కోరారు. ఉండవల్లి ఆగ్రోఫామ్ జనరల్ మేనేజర్ బి.హరికృష్ణ, రైతుల నాయకులు గుత్తికొండ రాము, మిక్కిలినేని మధు, గోపి, త్రివిక్రమ్, ఇతర రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొల్లూరి చిన్నాకు జాతీయ సేవా పురస్కారం

పెడన: దేశ మొదటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ జాతీయ సేవా పురస్కారాన్ని పెడన పట్టణానికి చెందిన ఆర్యవైశ్య అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి చిన్నా అందుకున్నారు. విశాఖపట్నంకు చెందిన దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ సంస్థ స్థాపించి 37 సంవత్సరాలు, విశాఖరత్న కళా పరిషత్ సంస్థ స్థాపించి 27 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏపీ, తెలంగాణ, ఒరిస్సా రాష్ట్రాల్లో విశిష్ట సేవలందించిన ప్రతిభావంతులను గుర్తించి వివిధ అవార్డులను అందజేశారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు అందించిన సేవలను గుర్తించిన నిర్వాహకులు తనకు ఈ అవార్డును అందజేశారని కొల్లూరి సత్యనారాయణ (చిన్నా) ఈ సందర్భంగా ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. విశాఖపట్నం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవంలో తాను ఈ అవార్డులను అందుకున్నట్లు తెలిపారు. తనకు అవార్డు రావడం పట్ల ఆర్యవైశ్య సంఘ నాయకులు అభినందనలు తెలియజేశారని చెప్పారు.